# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ రాయలసీమలో లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

❖ వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి పి.నారాయణ సమీక్ష నిర్వహించారు.

❖ రాష్ట్రంలో మైనారిటీ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ పేర్కొన్నారు.

❖ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

రాయలసీమలో లక్ష కోట్ల రూపాయలతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇందులో ప్రైవేటు రంగం వాటా 60 వేల కోట్ల రూపాయలు కాగా.. ప్రభుత్వం 40 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతున్నట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో రెండో రోజు పర్యటించిన ముఖ్యమంత్రి 117 కోట్ల రూపాయలతో బస్‌స్టేషన్, డిపో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్‌ను ప్రారంభించామని, కుప్పంలో కూడా బంగారు గనులు ఉన్నాయని, వాటిని అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. యువత వ్యాపారవేత్తలుగా ఎదగాలని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

అనంతరం కంగుందిలో డీకేటీ పట్టాల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... కుప్పం నియోజకవర్గాన్ని టూరిజం హబ్‌గా మారుస్తామన్నారు. రైతులందరూ సేంద్రియ సాగువైపు మళ్లాలని, గో ఆధారిత సేద్యం చేయాలని కోరారు.

====================

స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ నివాళులు అర్పించారు. సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ... గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలనను ఎదిరించి అపూర్వ సాహసాన్ని ప్రదర్శించిన మహనీయుడు అల్లూరి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి యావత్ జాతికి చిరస్మరణీయమన్నారు. అల్లూరి ఆశయాలే దేశానికి మార్గదర్శకమని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయాలంటే సేవాభావంతో ముందుకు సాగాలని... సమాజం కోసం నిలబడటమే నిజమైన దేశభక్తి అని అల్లూరి సీతారామరాజు జీవితం మనకు నేర్పుతుందని పేర్కొన్నారు.

====================

వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ రాజమహేంద్రవరంలో అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోదావరి మహా పుష్కరాల కోసం ప్రభుత్వం 1,500 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని వెల్లడించారు. ఇందులో రాజమహేంద్రవరం నగరంలోనే మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల కోసం 580 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులతో తొలిదశ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. అలాగే నగరంలో మురుగునీటి శుద్ధి కేంద్రాలను (STP) త్వరితగతిన నిర్మించి.. మురుగునీరు గోదావరి నదిలో కలవకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

====================

మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా ఈరోజు నిర్వహించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత.. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. ప్రజల హక్కుల కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి కేవలం 27 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు.

====================

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈ నెల 16, 17వ తేదీల్లో కోనసీమ క్వాయర్ కాన్ క్లేవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఈ కాన్ క్లేవ్ కు నాలుగు రాష్ట్రాల నుండి క్వాయర్ అనుబంధ పరిశ్రమలకు సంబంధించిన పారిశ్రామిక వేత్తలు, ఎం.ఎస్.ఎం.ఈలు, అధికారులు రానున్నారు. ఈ నేపథ్యంలో అమలాపురం కలెక్టరేట్ లో కాన్ క్లేవ్ కు సంబంధించి ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. కోనసీమలో లక్షా 20 వేల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోందని, దీనికి అనుబంధంగా ఉపాధి కల్పించేందుకు క్వాయర్ పరిశ్రమలకు సంబంధించి జాతీయస్థాయి కాన్ క్లేవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, యువతతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విరామం

====================

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ముందే మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా రవాణా ఏర్పాట్లను పూర్తి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. 2041 మాస్టర్ ప్లాన్ పరిధిలోని రహదారుల అభివృద్ధిపై ఈరోజు సమీక్ష నిర్వహించారు. నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గుర్తించిన మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

====================

రాష్ట్రంలో మైనారిటీ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. నంద్యాలలో మంత్రి ఈరోజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... మైనారిటీ సంక్షేమ శాఖ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన విజయవాడలో `మెగా జాబ్ మేళా` నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, ఉపాధి కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.

====================

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. సీతానగరం మండలంలో ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల సంఘం అందిస్తున్న డిజిటల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసీఐనెట్ మొబైల్ యాప్‌లోని `బుక్ ఎ కాల్ విత్ బీఎల్ఓ` సదుపాయం లేదా voters.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా బీఎల్ఓతో కాల్ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. కాల్ బుక్ చేసిన 48 గంటల్లోపు సంబంధిత బీఎల్ఓ స్వయంగా ఓటరును సంప్రదించి అవసరమైన సమాచారాన్ని అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగా ఓటరు నమోదు, పేరు, వయస్సు, చిరునామా వివరాల్లో మార్పులు, సవరణలు చేసుకోవచ్చని తెలిపారు.

====================

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఐదు టీ-20ల సిరీస్‌లో భాగంగా ఈరోజు రెండో క్రికెట్ మ్యాచ్ జరగనుంది. మాంచెస్టర్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. తొలి టీ-20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే.

====================

రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం రాగల రెండు రోజుల్లో మరింత బలపడనుందని అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో రేపు, ఎల్లుండి కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తూ.. ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త కరుణ సాగర్ తెలిపారు. అదే విధంగా పిడుగులు పడే ప్రమాదం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

====================
====================